

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం

19 అక్టోబర్ 2025 పేజీలు : 08


'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'లో

## ప్రజలు భాగస్వాములు కండి

కమిషనర్ వై.ఓ నందన్



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

పర్యావరణ హితం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పది ప్రాంతాల్లో పర్యావరణహిత అవగాహన సైకిల్ ర్యాలీలు, మొక్కలు నాటే కార్యక్రమాలను శనివారం చేపట్టారు. అందులో భాగంగా స్థానిక ఎస్పీ బంగ్లా నుంచి బట్వాడిపాలెం కూడలి వరకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నేతృత్వంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాలు కమిషనర్ పాల్గొని మొక్కలను నాటి సంరక్షించే చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా 'క్లీన్ ఎయిర్' అంశంపై కార్పొరేషన్ ఆధ్వర్యంలో -మిగతా 2లో

జీఎస్టీ వెసులుబాటుతో..

## ప్రజలకు ఊరట



- భారీగా తగ్గిన ధరలు..
- నిత్యావసర సరుకులపై రూ.2 వేల వరకు ఆదా !
- వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రయోజనకరం
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిగించిన జీఎస్టీ వెసులుబాటు వలన తగ్గిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట కలిగిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆత్మకూరు పట్టణంలో జీఎస్టీ సంస్కరణల వలన కలిగిన ప్రయోజనాలు ప్రజలకు వివరించేందుకు జీఎస్టీ, రవాణా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ర్యాలీని మంత్రి ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. గతంలో జీఎస్టీ ప్రవేశ పెట్టేముందు అధ్యయనం చేసేందుకు ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్రంలోని పలువురు ఆర్థిక శాఖ మంత్రులతో తాను కూడా పలు దేశాల్లో పర్యటించినట్లు మంత్రి ఆనం గుర్తు చేశారు. అక్కడ జీఎస్టీ అమలు తీరును పరిశీలించిన అనంతరం.. మనదేశంలో జీఎస్టీని ప్రవేశపెట్టినట్లు ఆనం చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీఎస్టీ 2.0తో అన్ని వర్గాలకు మేలు చేకూరిందన్నారు. ప్రతి కుటుంబానికి సుమారు 2 వేల రూపాయల వరకు ఆదా అవుతుందని వివరించారు. ప్రభుత్వాలు చేసిన మంచిని ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే నిత్యావసర సరుకులు, బ్రష్‌లు, సబ్బులు, కొబ్బరి నూనె, కొన్ని నిత్యవసర సామాగ్రిపై 18 శాతం ఉన్న జీఎస్టీని కేవలం 5 శాతానికి తగ్గించడంతో ఈ ధరలను కూడా బాగా తగ్గినట్లు చెప్పారు. ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తూ డయాబెటిక్ మందులపై జీఎస్టీని పూర్తిగా తొలగించినట్లు మంత్రి వివరించారు. అత్యవసర పరిస్థితుల వినియోగించే -మిగతా 2లో

## పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



- ఆత్మకూరు నియోజకవర్గానికి 10వేల సోలార్ యూనిట్లు మంజూరు
- విద్యుత్ పొదుపుతో పాటు ఆదాయం కూడా లభిస్తుంది
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆత్మకూరు పట్టణ ప్రజలందరూ ముందుకు రావాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని ఒక ఇంటిపై ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్స్‌ను మంత్రి స్వయంగా పరిశీలించి, ఆ ఇంట్లో ఏసీ, టీవీ, గీజర్, ఫ్రిడ్జ్ సోలార్‌తో పనిచేస్తున్న విధానాన్ని యజమానిని అడిగి తెలుసుకున్నారు. తమకు సోలార్ విద్యుత్ వలన ఎంతో ఉపయోగంగా ఉందని, విద్యుత్ బిల్లు చాలా తగ్గిందని వారు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేకంగా అమలుచేస్తున్న పీఎం సూర్యఘర్ పథకంతో అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ఆత్మకూరు నియోజక వర్గానికి సుమారు 10వేల పైగా -మిగతా 2లో

పోలీసుల త్యాగాలు

## వెలకట్టలేనివి



ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని శనివారం ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. సమాజసేవలో పోలీసులు తమవంతు పాత్ర పోషించడం సంతోషదాయమన్నారు. సుమారు వందమందికి పైగా రక్తదానం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తం అవసరమైన రోగులకు ఈ బ్లడ్ బ్యాంకు ద్వారా సేకరించిన రక్తం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డిఎస్పీ వేణుగోపాల్, సిఐలు గంగాధర్, వేమారెడ్డి పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం




**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర సంకల్పంలో భాగంగా ప్రతినెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్ర - కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా 'ఈ-వ్యర్థాలను వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడం థీమ్'ను ఎంచుకున్నామని సీఎం చంద్రబాబు తెలపడంతో చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యం అవుతుందని వెల్లడించారు. స్వర్ణాంధ్ర-2047 సంకల్పంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రతి నెలా 3వ శనివారం రోజు జరుపుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రతి కార్యక్రమం స్ఫూర్తివంతంగా ఉండేందుకు నెల నెలా ఒక్కో థీమ్‌ను ఎంచుకుని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో యంవి. మోహన్‌రావు పేర్కొన్నారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సైదాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొన్నారు. అనంతరం జడ్పీ హైస్కూల్ దగ్గర నుండి రాపూరు పొదలకూరు క్రాస్ వరకు ర్యాలీ నిర్వహించరు. అనంతరం ప్రజలకు ఎక్కడికక్కడ ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయండని సూచించారు. వీటి నిర్వహణకు గ్రామాలలో ప్రాంతాల్లోని పంచాయతీ సిబ్బందిని గుర్తించి వారి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ అనేది ఈ - వేస్ట్ కలెక్షన్ సెంటర్ల నినాదం కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసి తద్వారా స్వర్ణాంధ్ర సంకల్పాన్ని మరింత ముందుకు వెళ్లే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో యంవి. మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో మండల సిబ్బంది, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

సోలార్ యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు. 2 కిలోవాట్లు, 3 కిలోవాట్ల మేరకు సామర్థ్యంతో ప్రతి ఇంట్లో ఈ యూనిట్లు ఏర్పాటుచేసుకోవచ్చన్నారు. 2 కిలోవాట్లకు ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్‌స్టాల్ చేస్తుందన్నారు. ఇతర వర్గాలకు సబ్సిడీతో అందిస్తుందని చెప్పారు. జీఎస్టీ ఐదు శాతానికి తగ్గడంతో పదివేల వరకు తగ్గింపు కూడా వర్తిస్తుందని చెప్పారు. ఇంటికి పోను మిగులు విద్యుత్ ద్వారా కూడా ఆదాయం సమకూరుతుందన్న మంత్రి, ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రజలందరూ సోలార్ వైపు మొగ్గుచూపాలని పిలుపునిచ్చారు.

## లెప్రసీ కాలనీలో దివ్యాంగులకు బెడ్ షీట్స్ ఫ్రూట్స్ పంపిణీ

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు లెప్రసీ కాలనీలో కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాలలో బీసీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దివ్యాంగులకు బెడ్‌షీట్స్, పండ్లు శనివారం పంపిణీ చేశారు. సమాజ సేవలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో కళాశాల యజమాన్యం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు సహకారం అందించిన కళాశాల డీన్ సుధారాణి, ప్రిన్సిపాల్ నాగయ్య, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు షావలి, విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు.




# జీఎస్టీ వెసులుబాటుతో ప్రజలకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

మందులపై జీఎస్టీని 5 శాతం ప్రకటించినట్లు చెప్పారు. రైతులకు ఉపయోగపడే ట్రాక్టర్లు, ట్రాక్టర్ పరికరాలపై 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించినట్లు చెప్పారు. ఏసీలు, టీవీలు, ఫ్రిజ్లు మొదలైన వస్తువులపై కూడా జీఎస్టీ బాగా తగ్గి ప్రతి ఒక్కరికి అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ప్రధానంగా రవాణా రంగంలో జీఎస్టీ సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్క వాహనంపై 8 వేల నుంచి 2 లక్షల వరకు తగ్గినట్లు చెప్పారు. స్కూటర్లు, బైక్లు, కార్లు ధరలు బాగా తగ్గినట్లు చెప్పారు. ప్రతి ఇంటికి కూడా జీఎస్టీ ఫలాలు అందేలా, జీఎస్టి వలన కలిగే మంచిని వివరించేలా తమ ప్రభుత్వం, నాయకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జీఎస్టీ ఫలాలను ప్రతి ఒక్కరికి అందించి, ప్రతి కుటుంబంలో ఆనందాలు నింపిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తొలుత జాయింట్ కమిషనర్ కిరణ్ కుమార్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చందర్ జీఎస్టీ ప్రయోజనాలను ప్రజలకు క్లుప్తంగా వివరించారు.




### ట్రాక్టర్, స్కూటర్ షోరూమ్‌లను సందర్శించిన మంత్రి ఆనం

ఆత్మకూరు పట్టణంలోని ట్రాక్టర్లు, స్కూటర్ షోరూమ్ లను మంత్రి ఆనం సందర్శించారు. జీఎస్టీ తగ్గింపు వలన ధరలు తగ్గిన వాహనాల వివరాలను షో రూమ్ యజమానులను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులతో మాట్లాడి జీఎస్టీ వల్ల కలిగే మేలును వివరించారు. అనంతరం నూతనంగా ట్రాక్టర్లు, స్కూటర్ కొన్న వినియోగదారులకు మంత్రి తన చేతుల మీదుగా తాళాలు అందించి అభినందించారు. ఒక్కొక్క ట్రాక్టర్ పై సుమారు 40 వేల వరకు ధర తగ్గిందని, జీఎస్టి తగ్గింపు వలన తమకు ఎంతో మేలు జరిగిందని రైతులు మంత్రితో తమ సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భూమిరెడ్డి పావని, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయ రెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, వేలూరు కేశవ చౌదరి, ఏఎంసి చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు, వైస్ చైర్మన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు తుమ్మల చంద్రా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాలరెడ్డి, కౌన్సిలర్‌లు సూరా భాస్కర్ రెడ్డి, పెంచలయ్య యాదవ్, మహబూబ్ బాషా, గోస్ బాషా, శివకోటారెడ్డి, రమాదేవి, తెలుగుదేశం నాయకులు పులిమి శైలజా రెడ్డి, దావా పెంచల రావు, సుంకర పెంచల చౌదరి, కేతా విజయ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, తహసీల్దార్ పి.పద్మజా కుమారి, ఎంవిఐ రాములు, పలువురు అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'లో ప్రజలు భాగస్వాములు కండి




(మొదటి పేజీ తరువాయి)

నగరవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. వాతావరణంలో వాయు కాలుష్యాన్ని తగ్గించి ప్రకృతికి స్వచ్ఛమైన వాయువులను అందించేందుకు ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని కర్బన ఉద్గారాలను తగ్గించే దిశగా పాటుపడాలని సూచించారు. కాలుష్యాన్ని పెంపొందించే పెట్రోల్, డీజిల్ ఆధారిత వాహనాలకు ప్రత్యామ్నాయంగా సైకిల్, ఎలక్ట్రిక్ బైకులు, ఎలక్ట్రిక్ కారుల వాడకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. వీలున్నంతలో ప్రతి ఒక్కరు స్వచ్ఛమైన వాయువులను అందించే పర్యావరణ హితమైన మొక్కలను నాటి, వాటిని సంరక్షించే బాధ్యతలను చేపట్టాలని కమిషనర్ వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ప్రజలు నివాసం ఉండటం ప్రమాదకరమని, స్థానిక రెవెన్యూ అధికారులకు, లేదా వార్డు సచివాలయాలలో సమాచారం అందిస్తే వారికి తాత్కాలిక పునరావాస ఏర్పాట్లను కల్పిస్తామని కమిషనర్ తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా అగ్ని ప్రమాదాల సంభవించే మందుగుండు సామాగ్రితో కూడిన టపాసులను ఇళ్లలో నిల్వ ఉంచడం ప్రమాదకర మని, బాణాసంచా కాల్చే సమయంలో ప్రజలంతా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. వర్షపు నీటి ప్రవాహానికి డ్రైను కాలువలలో అడ్డంకులు ఏర్పడకుండా శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు వర్షాలకు సంబంధించి ఎలాంటి సహాయం పొందాలన్నా కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్ 9494018118కు వాట్సాప్ ద్వారా లేదా ఫోన్‌కాల్ ద్వారా సమాచారాన్ని అందజేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్ రావు, అన్ని విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పుట్టిన శిశువుకు పుట్టినరోజు వేడుకలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** పుట్టినరోజు పార్టీలు ఎంత సరదాగా ఉంటాయో ముఖ్యంగా వారి పిల్లలు మొదటి పుట్టిన రోజు కోసం ఎంత ప్లాన్ చేస్తున్న తల్లిదండ్రులకు ఇది ఒక చిరు జ్ఞాపకంగా నిలిచిపోతుంది. సైదాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చీకవోలు గ్రామానికి చెందిన ఎస్టీ మహిళ రాపూరు సుబరత్నమ్మ అనే మహిళకు పురిటి నొప్పులు వస్తున్నాయని తెలుసుకున్న ఆశా వర్కర్ తక్షణమే స్పందించిన ఆశావర్కర్ కె.రాజమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం తీసుకువచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు సకాలంలో అందుబాటులో లేనప్పటికీ డాక్టర్ సలహా మేరకు వైద్య సిబ్బంది, షేక్ మున్ని స్టాఫ్‌నర్స్, షరీన్ స్టాఫ్ నర్స్, సిహెచ్ సంధ్య ఏఎన్ఎం, ఆశా వర్కర్ కె.రాజమ్మ, ఎంతో చాకచక్యంగా ఆ మహిళకు పురుడుపోశారు అనంతరం ఆ మహిళ ఆడ శిశువుకు సురక్షితంగా జన్మనిచ్చింది. తల్లి సమక్షంలోనే ఆ బిడ్డకు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పుట్టినరోజు వేడుకలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించి తల్లిదండ్రుల ముఖం లో సంతోషం ఎల్లబోస్తూ ఈ పుట్టినరోజు తల్లిదండ్రుల్లో ఉన్నటువంటి మానసిక ఒత్తిడిని తగ్గిస్తూ సరదాగా జరుపుకునేవిధంగా ఉండాలని జీవితంలో మొదటి పుట్టినరోజు జ్ఞాపకంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రాథ మిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఈ పుట్టినరోజు వేడుకను కేకు చాక్లెట్స్, బిస్కెట్లతో పుట్టినరోజు వేడుకను నిర్వహించారు.

# బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం ఇండక్షన్ ప్రోగ్రామ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు విశ్వ విద్యాలయంలో లభించే వనరులను సద్విని యోగం చేసుకోవాలని, నైపుణ్యాభివృద్ధి కార్యక్ర మాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాదని, క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలతో కూడిన నాయకత్వ లక్షణాలను అలవరచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని సూచించారు. రిజిస్ట్రార్ డా. కె.సునీత మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు విశ్వవిద్యాలయ వాతావరణం, సదు పాయాలను తెలుసుకుని సామూహికంగా పని చేయడం, సామాజిక బాధ్యతలను నేర్చుకోవచ్చని తెలిపారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డా. జి.సాయిశ్రవంతి, ఆచార్య సుజా ఎస్.నాయర్, డా. చెంచురెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, అధ్యాపక వనరులు, పరిశోధన, ఇంటర్న్‌షిప్ అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. ఆత్మవిశ్వాసం, బృందంతో పనిచేసే తత్వం వంటి గుణాలు కెరీర్ ఎదుగుదలకు దోహదం చేస్తాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ మాట్లాడు తూ.. విద్యార్థులు శ్రద్ధ, కృషి, సమయపాలన వంటి లక్షణాలను అలవరచుకుని ప్రతిభావం తులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# 111 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ, వారికి అన్నివిధాల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిలుస్తుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరులోని మున్సిపల్ బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన సభలో ఆత్మ కూరు నియోజకవర్గ పరిధిలోని 111మంది బాధిత కుటుంబ లబ్ధిదారులకు సుమారు రూ.85.50 లక్షలు విలువైన సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను ఆయా మండలాల కన్వీనర్లతో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఏ ఒక్కరూ కూడా ఇబ్బందులుపడకూడదనే ఉద్దేశంతోనే 175 నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు.

## మున్సిపల్ కార్మికులకు కిట్లు పంపిణీ

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్మికులకు రెండు జతల దుస్తులు, సామగ్రి గల కిట్లను మంత్రి ఆనం పంపిణీ చేశారు. 125 మంది మున్సిపల్ వర్కర్లకు ఆరు లక్షల విలువైన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరమణమ్మ, ఆర్డీఓ పావని, కమిషనర్ గంగా ప్రసాద్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**బాలికలు సాధికారిత వైపు సాగాలి**

# అన్ని రంగాల్లో రాణించాలి : సూపర్వైజర్ శ్రీదేవి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** బాలికలు సాధికారిత వైపు సాగాలని, అన్ని పథకాలు, చట్టాలు అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని ఆత్మ కూరు ఐసీడిఎస్ సూపర్ వైజర్ డి.శ్రీదేవి కోరారు. శనివారం ఆత్మకూరు మండలంలోని అప్పారావు పాలెం పంచాయితీ వద్ద ఉన్న పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో 'బాలికగా నాతోనే మార్పు' అనే లక్ష్యంతో ప్రోగ్రాం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో బాలికలు కూడా తమ స్వీయ పరిరక్షణ నేర్చుకో వాలని, విద్యను అభ్యసించాలని బాలికలకు విద్య అభ్యసించే విధానాలు మన గవర్నమెంట్ చాలా అవకాశాలు కల్పించి ఉన్నదని, ప్రతి బాలిక పౌష్టిక ఆహారం తీసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, సమాజంలో తమకంటూ ఒక గుర్తింపును పెంపొందించుకోవాలని శ్రీదేవి సూచించారు. ప్రతి బాలిక విద్య అభ్యసించాలనే సంకల్పంగా మన కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో భేటీ పడావో అనే కార్యక్రమంలో ప్రవేశపెట్టిందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఆడపిల్ల కూడా రక్షించబడాలి ప్రతి ఆడపిల్ల చదువుకోవాలి అని కార్యక్రమం ద్వారా ప్రతి బిడ్డ కూడా చదువుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుందని ఆమె తెలిపారు. బాల్యవివాహాలు చేయరాదని, 18 సంవత్సరముల లోపు ఆడపిల్లల అందరూ బాలికలే అని వారికి వివాహం చేయుట చట్టరీత్యా నేరమని బాల్య వివాహాలు కనక ప్రోత్స హిస్తే చట్టరీత్యా శిక్షకు అర్హులు అవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు జి.జ్యోతి, వరలక్ష్మి, విజయరాణి అంగన్వాడీ సహాయకులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా బాణసంచా అమ్మ రాదు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** దీపావళిపండుగ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో లైసెన్సులు లేకుండా బాణసంచాఅమ్మ రాదని స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి హరిబాబు శనివారం ఒక ప్రకటన తెలిపారు. లైసెన్సులు లేకుండా బాణసంచా అమ్మే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా బాణ సంచాలు అమ్మాలనుకుంటే సంబంధిత శాఖల అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. ఉదయగిరి పట్టణంలో ఐదు, సీతారాంపురం మండలంలో నాలుగు, వరికుంటపాడు మండలంలోఒక దుకాణానికి తాత్కాలిక లైసెన్సలు వచ్చాయన్నారు. దుకాణాల వద్ద ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త తీసుకుంటూ నిబంధనలు పాటించాలన్నారు.

## నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నిరుద్యోగ యువతీ యువకులకు గురువారం ఉదయగిరి మండల కేంద్రంలోని ఎస్ఎంజీఆర్ అగ్రికల్చరల్ కాలేజి ప్రాంగణంలో జాబ్ మేళానిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశన్ని నిరుద్యోగ యువతీ యువకులు సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్లన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సారధ్యంలో గురువారం ఉదయగిరి మండల కేంద్రంలోని ఎస్ఎంజీఆర్ అగ్రికల్చరల్ కళాశాల ప్రాంగణంలో పలు కంపెనీలు, వారి మేనేజర్లతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన యువకులు https://naipunyam.ap.gov.in/user registration వెబ్ సైట్లింక్ నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. పదవ తరగతి పైబడి చదివిన 18 సంవత్సరాల నుండి 39 సంవత్సరాల నిరుద్యోగ యువతీ యువకులు ఈ చక్కని సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కావున తెలుగు దేశం జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు తమ తమ పంచాయతీలోని నిరుద్యోగ యువతీ యువకులకు తెలియపరచి ఈ జాబ్ మేళాలో పాల్గొని వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకునేలా చూడాలన్నారు.

## కులం పేరుతో ఎవరినీ దూషించలేదు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** తిమ్మసముద్రంలో యాదవులను ఎవరూ కులం పేరుతో దూషించలేదని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన గద్దగుంట రమేష్ యాదవ్ తెలిపారు. జలదంకి మండల కేంద్రంలో శనివారం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన యాదవులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దగుంట రమేష్ యాదవ్ మాట్లాడు తూ.. ఇటీవల సామాజిక మాధ్యమాలలో వచ్చిన విషయం అంత తప్పు అని తెలిపారు. దేవరాళ్ల శ్రీకాంత్ యాదవ్ రాజకీయం వాడు కొనేందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన అన్నారు. మా గ్రామంలో ఇప్పటి వరకు కులం పేరుతో దూషించిన దాఖలాలు లేవని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవరాళ్ల మహేశ్వరరావు, దేవరాళ్ల మాల్యాద్రి, దేవరాళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు అర్బన్, రూరల్ ప్రాజెక్టు పరిధిలోని శనివారం నాడు అల్లిపురం ఎస్ఆర్ఆర్ పాఠశాల నందు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికార అధికారిని బి.హేనా సుజన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. బాలికలపై జరుగుతున్న హింస, లైంగిక దాడులు, బాల్య వివాహం, లింగ వివక్షతల గురించి వివరంగా వివరించారు. అలాగే 18 సంవత్సరాలు లోపు బాల బాలికల సంరక్షణ కోసం 2012వ సంవత్సరంలో పోక్సో అనే ప్రత్యేక చట్టాన్ని భారత ప్రభుత్వం తీసుకురావడం జరిగింది. 18 సంవత్సరాల లోపు బాల బాలికలు మానసికంగా శారీరకంగా ఇబ్బంది పెట్టిన వారిపై ఫోక్సో చట్టం క్రింద శిక్షకు అర్హులు అవుతారని తెలియజేశారు. అనంతరం నెల్లూరు సిడిపిఓ టి.అరుణ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా బాలికలకు లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ గేమ్స్ పెట్టి విజేతలకు 1వ, 2వ, 3వ బహుమతులు ఇవ్వడం జరిగింది. అలాగే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్యకరమైన జీవనానికి ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు షైక్ ఖాదర్ బాష, రమేష్, అంగన్వాడి సూపర్వైజర్ వి.శకుంతల, అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# లే అవుట్ల యజమానులు ఇబ్బందులకు గురి కావొద్దు

- ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి
- అక్టోబర్ 23 ఎల్ఆర్ఎస్‌కు చివరి తేదీ
- ఎంపీడీఓ శ్రీనివాసులు రెడ్డి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పంచాయితీ అనుమతులు లేకుండా, లే అవుట్స్ ఏర్పాటు చేసి విక్రయించుకున్న, విక్రయించుకుంటున్న లేఅవుట్ల యజమానులు, భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని, వింజమూరు ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శనివారం వింజమూరులోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి కొప్పర్తి రామారావుతో కలిసి ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. అక్టోబర్ 23వ తేదీతో ఎల్ఆర్ఎస్‌కు గడువు ముగుస్తుందని, లే అవుట్ల యజమానులు, ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఎల్ఆర్ఎస్ స్కీమ్ లోకి చేరాలని దీనివల్ల భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని తెలియజేశారు. జూన్ 31కి ముందు ఏర్పాటుచేసిన ప్లాట్ల యజమానులు అందరూ ఈ స్కీంలోకి అర్హులన్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా అప్లై చేసుకున్న వారికి, మొదట 45 రోజులలో 10శాతం 90 రోజుల లోపల అప్లై చేసుకున్న వారికి ఐదు శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లేనియెడల ప్రభుత్వం తీసుకునే చర్యలకు మేము బాధ్యులం కాదన్నారు. వింజమూరు మండలంలో మొత్తం 25 లేఅవుట్లు ఉండగా అందులో రెండిటికి మాత్రమే అనుమతులు ఉన్నాయని ఈమధ్య కాలంలో ఒక లేఔట్ యజమాని ఎల్ఆర్ఎస్ స్కీం లోకి వచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 23 తర్వాత అనుమతులు లేని లేఅవుట్లపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి రామారావు మాట్లాడుతూ.. అనుమతుల లేని లే అవుట్‌లకు ఎన్ఓసి, ఇవ్వమన్నారు. అదేవిధంగా భవనాల నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఉండవన్నారు. దిక్కరించి ముందుకు వెళితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం దీనిపై చాలా కఠినంగా ఉందని, అర్థం చేసుకొని, ఎల్ఆర్ఎస్‌లో చేరాలని తెలిపారు. గతంలో కూడా అందరికీ తెలియపరచి ఉన్నామని మరోసారి తెలియజేస్తున్నట్లు తెలిపారు.

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో శనివారం రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈనెల 21వ తేదీన పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శనివారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం రక్తదాన కార్యక్రమంలో పాల్గొని రక్తాన్ని అందించిన పోలీస్ అధికారులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరూ తమకు వీలైన సమయంలో రక్తదానం చేయాలని మంత్రి సూచించారు. స్థానిక డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈ శిభిరం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐకు, ఆర్డీవో భూమిరెడ్డి పావని, పోలీస్ సిబ్బంది, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయ రెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, వేలూరు కేశవ చౌదరి, ఏఎంసి చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు, వైస్ చైర్మన్ గొట్టిగుండాల బుజ్జి రెడ్డి, తుమ్మల చంద్రా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాలరెడ్డి, కౌన్సిలర్‌లు సూరా భాస్కర్ రెడ్డి, పెంచలయ్య యాదవ్, మహబూబ్బషా, గోస్ బాషా, శివకోటారెడ్డి, రమాదేవి, తెలుగుదేశం నాయకులు పులిమి శైలజా రెడ్డి, దావా పెంచల రావు, సుంకర పెంచల చౌదరి, కేతా విజయ భాస్కర్ రెడ్డి,మున్సిపల్ కమీషనర్ సి.గంగా ప్రసాద్, తహసీల్దార్ పద్మజా కుమారి, ఎంవిఐ రాములు, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ర్యాలీ




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నెల్లూరు-ముంబై జాతీయ రహదారిపై నెల్లూరుపాలెం కూడలిలో సూపర్ జీఎస్టీ ర్యాలీని శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పోస్టర్లును మంత్రి ఆనం ఆవిష్కరించారు. నెల్లూరుపాలెం కూడలి నుంచి బస్టాండ్ వరకు సందడిగా ర్యాలీ కొనసాగింది. ట్రాక్టర్ల షోరూమ్, బైక్ షోరూం సందర్శించి, తగ్గిన జీఎస్టీ ధరలతో నూతన ట్రాక్టరు, టూవీలర్ వాహనాలు కొనుగోలు చేసిన లబ్ధిదారులకు తాళాలను మంత్రి ఆనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భూమిరెడ్డి పావని, తెలుగుదేశం నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, వేలూరు కేశవ చౌదరి, ఏఎంసి చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు, వైస్ చైర్మన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, తుమ్మల చంద్రా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాలరెడ్డి, కౌన్సిలర్‌లు సూరా భాస్కర్‌రెడ్డి, పెంచలయ్య యాదవ్, మహబూబ్బషా, గోస్ బాషా, శివకోటారెడ్డి, రమాదేవి, తెలుగుదేశం నాయకులు పులిమి శైలజా రెడ్డి, దావా పెంచల రావు, సుంకర పెంచల చౌదరి, కేతా విజయ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ సి.గంగా ప్రసాద్, తహసీల్దార్ పి.పద్మజా కుమారి, ఎంవిఐ రాములు, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోక్సో చట్టంపై బాల బాలికలకు అవగాహన



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం డిఎస్ఆర్ పాఠశాల నందు పోక్ సో చట్టంపై బాల బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ఏ.రాజేశ్వరి మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, ఐరన్ మాత్రల ప్రాముఖ్యత, అపరిచితుల నుండి జాగ్రత్త మెలుకువలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అలాగే తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ప్రభావతి, శ్యామల, శ్రీలక్ష్మి, మంజూన్ బి, అంగన్వాడి వర్కర్లు, బాల బాలికలు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో అందంగా రూపుదిద్దుకున్న

# జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** దాతల సహకారంతో బిజింపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వేదిక చుట్టూ సరస్వతీ దేవి ప్రాంగణం మొత్తం ప్రదేశం దాదాపు 3వేల చదరపు అడుగులు 1994-95 పదవ తరగతి పూర్వ విద్యార్థి బృందం 2500 చదరపు అడుగుల వైశాల్యంలో 1,70,000/- విలువైన పార్కింగ్ టైల్స్ వేయించడం జరిగింది. ఈ ప్రాంగణాన్ని ప్రధానోపాధ్యాయులు మాధవరావు చేతుల మీదుగా శనివారం పాఠశాలకు అందుబాటులోకి తీసుకొని రావడం జరిగింది. కృష్ణారెడ్డి పల్లెకు చెందిన అంగన్వాడి టీచర్ కాకు రమాదేవి పాఠశాల లైబ్రరీకి 8వేలు విలువైన రెండు ఐరన్ ర్యాక్ లను బహుకరించారు. అదేవిధంగా కృష్ణ రెడ్డి పల్లి వాస్తవ్యులు కాకు రవి 10వేలు విలువైన ఒక ఐరన్ బీరువాను, అదేవిధంగా బండి ప్రసాద్ పాఠశాలకు 30వేలు విలువైన మైక్ సెట్‌ను బహుకరించారు. పాఠశాలకు అన్ని వసతులు కల్పిస్తూ పాఠశాలను అందంగా తీర్చిదిద్దేందుకు ఈ వసతులను కల్పించిన దాతలందరిని ప్రధానోపాధ్యాయులు మాధవరావు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు వారిని ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు, విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# చెకుముఖి టాలెంట్ టెస్ట్‌కు 1400 మంది హాజరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను శనివారం నిర్వహించగా 1400మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన ప్రశ్న పత్రాలను ఆత్మకూరు వెస్ట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ చెకుముకి ప్రశ్నాపత్రాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆత్మకూరు వెస్ట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్ ఆవిష్కరించారు. ఈ పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ఆత్మకూరు మండలంలో గల 12 ప్రభుత్వ, 9 ప్రైవేటు, 2 గురుకుల పాఠశాలలో కలిపి మొత్తం 23 ఉన్నత పాఠశాలలకు సంబంధించిన 1400మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పాఠశాల స్థాయి పరీక్ష నందు ప్రతి పాఠశాలలో 8, 9, 10 తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని విద్యార్థులు ముగ్గురు ఒక జట్టుగా నవంబర్ ఒకటవ తారీఖున మండల స్థాయిలో జరగబోవు చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారు. పై కార్యక్రమంలో జేవీవీ సీనియర్ నాయకులు సందాని, పార్లపల్లి సుధాకర్ రావు, పాఠశాల హెడ్మాస్టర్ ఎస్‌కె ఫయాజ్, పెంచలయ్య, మహబూబ్ బాషా, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవ వధువుకు పెళ్ళికానుక అందజేత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని కోళ్ల వీధికి చెందిన షేక్ జానీ భాషా, దిల్ షాద్ దంపతుల కుమార్తె వివాహ సందర్భాన్ని పురస్కరించుకొని, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ తరఫున 10వేలను పెళ్లి కానుకగా స్థానిక నాయకుల ద్వారా పెళ్లికుమార్తెకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన వధూవరులకు హృదయపూర్వక ఆశీర్వాదాలు తెలుపుతూ, వారి జీవితాలు ఆనందం, ఐశ్వర్యం, పరస్పర ప్రేమతో నిండిపోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయుసీ అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాసులు, స్థానిక నాయకులు, బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున పాల్గొని, వధూవరులను ఆశీర్వదించారు.

# శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ పునః నిర్మాణం చారిత్రాత్మకం

- భక్తుల మనోభావాలకు అనుగుణంగా గుడి నిర్మాణం
- మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ సహకారంతో ఆలయానికి పూర్వ వైభవం
- దళితులకు ప్రవేశం కల్పించిన తొలి ఆలయం శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని స్థానిక మూలాపేట నందుగల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన గ్రామసభను శనివారం ఉదయం నిర్వహించారు. శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ పునర్నిర్మాణం భక్తుల మనోభావాలకు అనుగుణంగా జరుగుతుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నేతృత్వంలో ఆలయానికి పూర్వ వైభవం చేకూరేందుకు కృషి చేస్తామని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ అధికారులు, స్థపతి, స్థానిక భక్తులు పలువురు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులుతోపాటు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేమిరెడ్డికి తీర్థ ప్రసాదాలతోపాటు వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులు ఆలయ నిర్మాణంకు సంబంధించిన విధివిధానాలను వివరించారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాల పునరుద్ధరణలో భాగంగా శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయాన్ని పునర్ నిర్మించేందుకు రాష్ట్ర మంత్రులు సంకల్పించడం జరిగిందన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోద ముద్ర వేశారన్నారు. ఎంతోకాలంగా ఆనం కుటుంబం ఆలయానికి ట్రస్టీగా కొనసాగుతున్నారని, వారి హయాంలో ఆలయం ఎంతో అభివృద్ధి చెంది స్వామివారి ఆస్తులు గణనీయంగా పెరిగాయి అన్నారు. ఈ క్రమంలో దేవాదాయ శాఖ మంత్రిగా ఆలయ పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టడం విశేషకరమన్నారు. దేవాదాయ శాఖ అధికారులు అందుకు సంబంధించిన నిర్మాణ నమూనాను సిద్ధం చేశారన్నారు. దేవాదాయ శాఖ స్తపతులు, ఆలయ అర్చకులు, స్వామివారి భక్తులతో సంప్రదించి వారి సూచనలు సలహాలు మేరకు నిర్మాణ పనులు చేపట్టనున్నమన్నారు. గతంలో ఆలయం నిర్మాణం సమయంలో యమ బాధలు ఉండకూడదన్న ఉద్దేశంతో దక్షిణ భాగంలో ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందనీ, స్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా జరిగేందుకు అనుకూలంగా నిర్మాణం చేపట్టారన్నారు. మొట్టమొదటిసారిగా దళితులకు ఆలయ ప్రవేశ కల్పించిన దేవస్థానం ఏదైనా ఉందంటే అది శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం మాత్రమే అన్నారు. అప్పట్లోనే ఆలయ ప్రాంగణంలో నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ట జరిగిందన్నారు. ఇప్పటివరకు దేవస్థానం ఆస్తులను కాపాడుకుంటూ వచ్చింది ఆనం కుటుంబమేనన్నారు. ఆలయ నిర్మాణం కోసం త్రిదండి పీఠాధిపతి శ్రీ చిన్న జీయర్ స్వామి వారిని సంప్రదించి నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ప్రజలందరికీ మంచి జరిగేలా గుడి పునర్నిర్మాణం జరుగుతుందని దేవాదాయ శాఖ ఆనం రామనారాయణరెడ్డి మంత్రి తనతో చెప్పడం జరిగిందన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వేమిరెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం పలువురు స్థానిక భక్తులు తమ సమస్యలను వేమిరెడ్డికి వివరించారు సానుకూలంగా స్పందించిన ఆయన నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్‌జేసీఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్, రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పి.పరమేశ్వరప్ప, కర్నూలు సూపరిండెంట్ ఇంజనీర్ ఎస్ సతీష్, గుంటూరు డివిజనల్ ఇంజనీరు సిహెచ్ శ్రీనివాసులు, నెల్లూరు ఏఈ మురళీమోహన్, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

### బాలికలకు స్వీయ పరిరక్షణ ఆవశ్యం

# విద్యతో ఉజ్వల భవిష్యత్ తథ్యం : సీడీపీఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** బాలికలకు స్వీయ పరిరక్షణ అత్యంత ఆవశ్యకమని, అందుకు బోలెడు చట్టాలు ఆసరాగా ఉన్నాయని, బాలికలు ఉన్నత, ఉత్తమ, నైపుణ్యతతొ కూడిన విద్య పొందితే ఉజ్వల భవిష్యత్తు తథ్యమని ఆత్మకూరు ఐసీడిఎస్ సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి వద్ద ఏపి బాలికల గురుకుల పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'బాలికగా నాతోనే మార్పు 'అనే అంశం లక్ష్యంగా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపివో సునీలత ప్రసంగిస్తూ బాలికలు స్వీయ పరిరక్షణ నేర్చుకోవాలని, నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించాలని, బాలికలకు విద్య అభ్యసించేం దుకు మన గవర్నమెంట్ చాలా అవకాశాలు కల్పించిందని, ప్రతి బాలిక పౌష్టిక ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, సమాజంలో తమకంటూ ఒక గుర్తింపును పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి బాలికకు విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో మన కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో భేటీ పడావో అనే కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఆడపిల్ల కూడా రక్షించబడాలి ప్రతి ఆడపిల్ల చదువుకోవాలని కార్యక్రమం ద్వారా ప్రతి బిడ్డ కూడా చదువుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బాల్యవివాహాలు ప్రోత్సహించ రాదని, 18 సంవత్సరముల లోపు ఆడపిల్లల అందరూ బాలికలే అని వారికి వివాహం చేయుట చట్టరీత్యా నేరమని బాల్య వివాహాలు కనక ప్రోత్సహిస్తే చట్టరీత్యా శిక్షకు అర్హులని తెలియజేశారు. బాల్య వివాహాల మీద ప్రభుత్వం అన్ని డిపార్ట్మెంట్ వాళ్ళని విలీనం చేసి ఉన్నదని, కాబట్టి బాల్య వివాహాలు జరపకుండా మన వంతు కృషి మనం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూత్, ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.కస్తూరి ప్రసంగించారు. అంగన్వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, శాంతి, పెంచలమ్మ, కామాక్షి అంగన్వాడి సహాయకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర సైకిల్ ర్యాలీ




**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన జలదంకిలో శనివారం స్వచ్ఛందర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వాయు కాలుష్యం నివారణకు అందరూ తోడ్పడాలని ఎంపీడీవో బ్రహ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు జలదంకి మండల కేంద్రంలో సైకిల్ తొక్కుతూ ర్యాలీ చేశారు. జలదంకి మండల కేంద్రంలో ఎంపీడీవో బ్రహ్మయ్య స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతినెల మూడవ శనివారం నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా మంచి గాలిని తీసుకోవడంపై అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. మండలంలో అన్నిచోట్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు పద్మనాభం, నాగేశ్వరరావు, ఏపీఓ శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాధాకృష్ణ మందిర కార్యాలయ ఏర్పాటుకు సాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణం యాదవ వీధిలో వెలిసి ఉన్నటువంటి శ్రీ రాధాకృష్ణ ఆలయ కార్యాలయ ఏర్పాటుకు బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి, బొమ్మిరెడ్డి రవీంద్రారెడ్డి జ్ఞాపకార్థంగా బొమ్మిరెడ్డి అరవిందమ్మ చేతుల మీదుగా 3లక్షల ఆర్థిక సాయం చేశారు. భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవిందమ్మ మాట్లాడుతూ.. రాధాకృష్ణ మందిరంకు సంబంధించిన ఈ కార్యాలయం ఏర్పాటు చేయడం నాకు ఎంతో సంతోషంగా ఉందని, ఇలాంటి దేవుని కార్యక్రమాలకు తనను సంప్రదించడం నా పూర్వజన్మ సుకృతంగా బావిస్తున్నానన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు తమ కుటుంబం ఎల్లప్పుడూ ఆత్మకూరు ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఆమె అన్నారు. ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ.. బొమ్మిరెడ్డి తారకనాథ్ రెడ్డి, డాక్టర్ షకీలా, డాక్టర్ గీతిక, వాళ్ల సహకారంతో రాధాకృష్ణ మందిరంకు సంబందించిన కార్యాలయం పూర్తి అయిందని, వాళ్లకి మా ఆలయ కమిటీ తరపున ధన్యవాదాలు తెలుపుతూ, బొమ్మిరెడ్డి కుటుంబం ఆత్మకూరు ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు, ఆత్మకూరు ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మిరెడ్డి అరవిందమ్మ, డాక్టర్ ఆదిశేషయ్య, 14వ వార్డ్ కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్య, వంటేరు మల్లికార్జున, సాధిక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆత్మనిర్భర భారత్ కార్యశీల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల కేంద్రమైన వింజమూరులోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో ఆత్మనిర్భర భారత మండల కార్యశాల నిర్వహిం చారు. మండల అధ్యక్షులుఅంబటి ఈశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా కో కన్వీనర్ చుండి హరగోపాల్ రెడ్డికార్యక్రమం హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన పార్టీ అభివృద్ధి పట్ల దిశానిర్దేశం చేశారు. ఇంటింటా స్వదేశీ, ప్రతి ఇంటా స్వదేశీ నినాధాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలని స్వదేశీ వస్తువుల వినియోగం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు గని రమణయ్య, మండల కమిటీసభ్యులు మద్దూరు నాగేశ్వర రెడ్డి, అంబటి సుధారాణి, దాసరి ప్రసాద్ తోపాటు రామచంద్ర, శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, కొండారెడ్డి క్రియాశీల సభ్యులు పాల్గొన్నారు.

## ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం భారతదేశ మాజీ రాష్ట్రపతి భారతరత్న గ్రహీత గొప్ప శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 95వ జయంతి సందర్భంగా 8, 9,10 తరగతుల విద్యార్థి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు నాయబ్ రసూల్ ఫరీద్ భాషా, కాకు రవి కుమర్, బండి రాజా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి రక్ష స్వచ్ఛమైన గాలి : ఎంపీడీఓ శ్రీనివాసులు రెడ్డి

## వాహనాల వినియోగాన్ని తగ్గిద్దాం.. కాలుష్యాన్ని నివారిద్దాం




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** జీవకోటికి చెట్లే ఆధారమని, ఆరోగ్యానికి రక్ష, స్వచ్ఛమైన గాలి ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని, వాహనాల వినియోగాన్ని తగ్గించి కాలుష్యాన్ని నివారిద్దామని వింజమూరు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నెలలో మూడో శనివారాన్ని పురస్కరించుకొని వింజమూరులో స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా వింజమూరు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు హై స్కూల్ నుండి స్థానిక పంచాయతీ బస్టాండ్ వరకు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపడుతున్న స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజు మూడో శనివారం స్వచ్ఛమైన గాలి పరిశుభ్రమైన వాతావరణం అనే అంశంతో ఈ ర్యాలీ నిర్వహిస్తునట్టు ఆయనతెలిపారు. వాతావరణంలో సంబవిస్తున్న ప్రధాన సమస్య గాలి కాలుష్యం, ఈ కాలుష్యన్ని అధికమించేందుకు చెట్లును విరివిగా నాటడం వంటి ప్రక్రియను చేపట్టాలని తగు సూచనలు చేశారు. వాహనాల రద్దీ నీ తగ్గించడం వలన కూడా గాలి కాలుష్యన్ని తగ్గించవచ్చుని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు వారి అవసరాల మేరకు సైకిల్‌ను ఉపయోగించుకుంటే కొంతమేరా పరిసరాలు శుభ్రంగా ఉంటాయని వివరించారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ రామారావు,మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, జనసేన అధ్యక్షులు బండారు సత్యనారాయణ, సీనియర్ నాయకులు మంచాల శ్రీనివాసులు నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు యాదవ్, కే.శ్రీనివాసులు నాయుడు, వసంతరావు, డేగ మధు యాదవ్, ఏగినేని శ్రీనివాసులు నాయుడు, ఎంఈఓ మధుసూదన్ రెడ్డి, దుద్దుగుంట శ్రీనివాసులు రెడ్డి, కటకం ప్రసన్నకుమార్, ఇతర నాయుకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల చైతన్యం సమాజాభివృద్ధికి మూలం : డా కరుణాకర్



**నెల్లురు సిటీ, మేజర్‌న్యూస్ :** ఇనమడుగులోని హైస్కూలు నందు నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవంలో ఇనమడుగు హోమియో వైద్యులు కరుణాకర్ పాల్గొని బాలికలను చైతన్యపరిచారు. ఆడపిల్ల పుడితే చిన్నచూపు చూసె స్తితి నుండి ఆడపిల్లలె కావలనె స్తితికి సమాజం ఏదగాలని అది జరగాలంటే బాలికల చైతన్యమొక్కటె సమాధానమని, బాలికలు ఇప్పుడు అన్ని రంగాల్లో ధీటుగా రాణిస్తున్నారని అది అలానె కొనసాగాలని ఇంకా బాల్యవివాహాలు జరుగుతున్నాయని అది ఆగాలంటే బాలికల చదువు, చైతన్యం ద్వారానె సాధ్యమని సూచించారు. ప్రభుత్వం కూడా అన్ని విదాలుగా బెటి పడావో, బెటి బచావో బాలికా సంరక్షణా పధకాలను అమలు చేస్తున్నాయని తెలిపార. బాలికలు చదువుతోపాటు, సమాజాన్ని చట్టాలను చదవాలని సూచించారు. అలా బాలికల చైతన్యం ద్వారా సమాజ అభివృద్ధి సాద్యమన్నారు. ఇంకా పోషక ఆహరపదార్దాలను తీసుకోవాలని, పరిశుబ్రతను పాటించాలని తద్వార రోగాలు రాకుండా కాపాడుకోవాలని సూచించారు. అలానే స్కూలునందు స్వచ్చాంధ్ర స్వర్ణాంధ్ర ప్రోగ్రాంను నిర్వహించి విద్యార్దుల చేత స్వచ్చాధ్ర ప్రతిజ్ఞ చేయించారు. గాలి కాలుష్యాన్ని నిరోదించె విదానలను చెట్లను నాటడమే కాదు సమ్రక్షణ బాద్యతను తీసుకోవాలని, తద్వార కలిగె లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్, టిచర్స్ ఆశా, అంగన్ వాడి స్టాఫ్, సూపర్ వైజర్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

# నగర పరిధిలో బార్లు మద్యం దుకాణాలను తనిఖీలు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పరిధిలోని పలు బార్లు మరియు ఏ ఫోర్ మద్యం దుకాణాలను ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.శంకరయ్య, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఏ.శ్రీనివాసులు నాయుడు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మద్యం విక్రాయాలు 'ఏపి ఎక్సైజ్ సురక్ష' మొబైల్ యాప్ ద్వారా జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. లైసెన్సీలు యాప్ ద్వారా బాటిల్లను స్కాన్ చేసి అమ్మకాలు నిర్వహిస్తున్నారా, యాప్‌లో రికార్డులు సక్రమంగా నమోదు అవుతున్నాయా వంటి అంశాలపై వివరంగా పరిశీలించారు. అదేవిధంగా వారు దుకాణాలకు వచ్చిన వినియోగదారులతో మాట్లాడి యాప్ వినియోగం ద్వారా వారికి కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ.. యాప్ ద్వారా వినియోగదారులు తమ కొనుగోలు చేసే మద్యం బాటిల్ అసలైనదా.. నకిలీదా అని తక్షణమే తెలుసుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా నకిలీ మద్యం నాన్ డ్యూటీ పేడ్ లిక్కర్ విక్రయాలు లేదా బెల్ట్ షాపుల గురించి సమాచారం ఉంటే యాప్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని వివరించారు. అలాగే లైసెన్సీలు తమ షాపుల్లో యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరగవలసిందిగా, బెల్ట్ షాపులకు సరఫరా చేసే అక్రమ చర్యలకు పాల్పడకూడదని హెచ్చరించారు. యాప్ సక్రమంగా వినియోగించకపోతే తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు మద్యం కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా బాటిల్ పై క్యూఆర్ కోడ్ ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేయాలని ఇది వినియోగదారుల హక్కులను కాపాడుతుందని మరియు నకిలీ మద్యం సమస్యను నిర్మూలించడంలో కీలక పాత్ర పోషిస్తుందని సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు 1 ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం.. పారిశుధ్యం పట్ల శ్రద్ధ చూపాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అందరూ పచ్చదనం -పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడిఎస్ సిడిపివో పి.సునీలత పిలుపునిచ్చారు. ప్రతినెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐసీడిఎస్ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్బంగా సిడిపివో మాట్లాడుతూ.. అందరం సామాజిక భాద్యతగా స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. అందరిని ఈ విషయమై చైతన్య పరిచేందుకు అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడిఎస్ సూపర్వేజర్లు జి.కస్తూరి, డి.శ్రీదేవి, రమాదేవి పద్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణ శంకుస్థాపనకు మంత్రికి ఆహ్వానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం గుండె మడగల గ్రామం నందు శ్రీ సీతారామ స్వాముల వారి దేవస్థానం శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డిని ముఖ్యఅతిథులుగా విచ్చేయమని ఆహ్వాన పత్రికను టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్పీ మాజీ చైర్మన్ పి.చంచల బాబు యాదవ్, కార్య నిర్వాహకులు టిడిపి సీనియర్ నాయకులు అంకినపల్లి ఓబులరెడ్డి, అంకినపల్లి శివశంకర్‌రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో ఆలయ నిర్మాణం జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందేనని ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## మూలస్థానేశ్వరుని సన్నిధిలో ప్రదోషకాల పూజ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలో వెలసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానం నందు త్రయోదశి సందర్భంగా శ్రీ నందీశ్వరునికి, శ్రీ స్వామి వార్లకు విశేషంగా అభిషేకాలు జరిగాయి. అనంతరం చిన్న వెండి నంది వాహనం పైన శ్రీ స్వామి అమ్మవార్ల ఊరేగింపు అత్యంత వైభవముగా నిర్వహించారు. శ్రీ స్వామి అమ్మవార్లు, శ్రీ నందీశ్వరుని దర్శనార్థం కొరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు. ఈ కార్యక్రమంకు ఉభయకర్తలుగా శ్రావణ్ కుమార్, లక్ష్మి శ్రావణి వ్యవహరించారని సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి అర్వ భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

## 60 తీర్మానాలతో పంచాయతీ సర్వసభ్య సమావేశం

### పంచాయతీ సమావేశానికి హాజరైన 7మంది వార్డు సభ్యులు,



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ సర్వసభ్య సమావేశానికి 7మంది వార్డు సభ్యులు హాజరయ్యారు. కోరం సరిపోవడంతో పంచాయతీ కార్యదర్శి కొప్పర్తి రామారావు సర్పంచ్ నల్లగౌండ్ల సృజన అధ్యక్షతన శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో 60 తీర్మానాలను చదివి వినిపించారు. వాటిలో ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, బోర్లు, మోటర్లు అమర్చడం, విద్యుత్ లైట్లకు ఆటోమేటిక్ స్విచ్, పారిశుద్ధ్య కార్మికులకు, జీతాలు చెల్లింపులు, గ్రావిల్ రోడ్లు, తదితర అంశాలపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా హాజరైన జడ్పిటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీలో బడ్జెట్ లేనప్పుడు కొత్తగా తీర్మానాలు చేయవలసిన అవసరం లేదని పాత తీర్మానాల పనులను పూర్తి చేయాలన్నారు. గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లింపు చేయాలన్నారు. నిత్య అవసరాలకు అవసరమైన నిధులను పంచాయతీలో ఉంచుకొని అవసరమైన పనులను అత్యవసరంగా చేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారి మాట్లాడుతూ.. ఒక లక్ష 50వేల రూపాయలు మాత్రమే ఉన్నాయి అని, వీటిని అవసరాలకు వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుణ్ణం సుశీల వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

క్లస్టర్ సముదాయ సమావేశాలు..

# విజ్ఞాన భాండాగారాలుగా తయారు కావాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** క్లస్టర్ సముదాయాలు విజ్ఞాన బండాగారాలు గా తయారు చేసుకోవాలని ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం గడ్డంవారిపల్లి క్లస్టర్ సముదాయ సమావేశముకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మొదట పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి తదుపరి డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనంను పరిశీలించారు. తదుపరి క్లస్టర్ సముదాయ సమావేశం నందు పాల్గొని క్లస్టర్ సముదాయ సమావేశంలో చాలా పాఠశాలల లోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొనడం వలన తమతమ బోధనా నైపుణ్యాలను సామర్థ్యాలను పాలుపంచుకోవడం, లో కాస్ట్ లో కాస్ట్ బోధనో ఉపకరణాలు ఏ విధంగా తయారు చేయాలి మరియు బోధన సులభరీతిలో ఏ విధంగా చేయాలి అనే సామర్థ్యాలను నైపుణ్యాలను ఒకరికొకరు వివరించుకోవడం వలన క్లస్టర్ సముదాయ సమావేశాలు విజ్ఞాన భాండాగారాలుగా తయారవుతాయని తెలియజేశారు. ఈ సమావేశం నందు క్లస్టర్ సముదాయ ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య పాల్గొన్నారు.



# నిండిగుంటపాలెం, సర్వేపల్లిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం నిండిగుంటపాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గ్రామ సచివాలయంలో ప్రజలకు పర్యావరణ పరిరక్షణ, తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. చవట హరిజనవాడలో స్మశానవాటికలో మొక్కలు నాటగా, నడవ హరిజనవాడలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాన్ని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రావూరు రాధాకృష్ణమ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు కట్టం రెడ్డి రాధాకృష్ణ రెడ్డి, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున రెడ్డి, బీజేపీ నాయకులు కుంచె శ్రీనివాసులు యాదవ్, ఆసనాపురం శ్రీనివాసులు, జీఎస్టీ కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓ కల్పన తదితరులు పాల్గొన్నారు. సర్వేపల్లి హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ కూడా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రావూరు రాధాకృష్ణమ నాయుడు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## విద్యుత్ స్తంభంపై చెలరేగిన మంటలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని శ్రీ వివేకానంద కళాశాలకు వెళ్లే రహదారి సమీపంలోని దుకాణం వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి ప్రమాదవ శాత్తు మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తు అక్కడ విద్యుత్ ట్రాన్సఫార్మర్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. స్తంభానికి అల్లిబిల్లిగా ఇచ్చిన విద్యుత్తు కనెక్షన్ వైర్లన్నీ ఒక తేట్టే లాగా ఉండడంతో షార్ట్ సర్క్యూట్ అయిందో లేక ఏ కారణం చేతనో మంటలు చెలరేగగా ఆ మంటలు క్రమక్రమంగా పెద్దవి కాసాగాయి ప్రజలు భయాందోళన కు గురయ్యారు. ప్రమాద విషయాన్ని స్థానికులు అగ్నిమాపక సిబ్బంది తెలియజేయగా వారు హుటాహుటిన అక్కడ చేరుకుని మంటలను అదుపు చేశారు ట్రాన్స్కో అధికారులు అక్కడ చేరుకొని జరిగిన సంఘటనను పరిశీలించారు. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛమైన గాలి - ఆరోగ్యకరమైన జీవనం అనే అంశం కింద ప్రతి నెల మూడవ శనివారం జరుపుకునే కార్యక్రమంలో భాగంగా, 2025 అక్టోబర్ 18న నెల్లూరు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయం, చిల్డ్రన్ హోమ్ ప్రాంగణాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికార అధికారిని బి.హేనాసుజన్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు జిల్లా బాలల సంరక్షణ అధికార బి.సురేష్, పిడి ఆఫీస్ ఈవో సునీత, చిల్డ్రన్ హోమ్ సూపరింటెంట్ కే.దుర్గా దేవి, పీడీ ఆఫీస్ సిబ్బంది, ఐసీపీస్ సిబ్బంది, శిశు గృహ సిబ్బంది, చిల్డ్రన్ హోమ్ సిబ్బంది స్వచ్ఛమైన గాలి - ఆరోగ్యకరమైన జీవనం అనే అంశంపై స్వచ్ఛందంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్యాలయం, చిల్డ్రన్ హోమ్ ప్రాంగణాలలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడి కార్యాలయ సిబ్బంది, చిల్డ్రన్ హోమ్ సిబ్బంది, ఐసీపీస్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు. అందరూ కలిసి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## పాఠశాలలు తనిఖీ : జిల్లా డైట్ అధ్యాపకులు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని శ్రీ కోలను ప్రాథమిక పాఠశాలను, అనుమ సముద్రం పేట జిల్లా పరిషత్ పాఠశా లను, శనివారం జిల్లా డైట్ సీనియర్ అధ్యాపకులు ఎల్.నటరాజన్ మూర్తి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సి, డి గ్రేడ్‌లో ఉన్న విద్యార్థుల గురించి తీసుకోవలసిన జాగ్రత్తలను ఉపాధ్యాయులకు, వివరించారు. మధ్యాహ్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు క్లస్టర్ సమావేశానికి హాజరై ఉపాధ్యాయుల హాజరు మరియు పాఠశాలల వారిగా విద్యార్థుల ప్రగతి, ఎఫ్ఎల్ఎన్, టీచర్ రైట్ లెవెల్ తరగతుల గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి, ఎంఈఓ 2 డి.సాయి ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రుక్మిణి, పలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకానికి

# జనార్ధనపురం ఎంపిక

ఎస్సీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు 20లక్షలు మంజూరు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి ఆదర్శ గ్రామపంచాయతీ యోజన పథకానికి జనార్ధనపురం పంచాయతీ ఎంపికైనట్లు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల పరిధిలోని జనార్ధన పురం గ్రామం 43శాతం ఎస్సీలు ఉన్నందున ప్రధానమంత్రి ఆదర్శ గ్రామపంచాయతీకి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పథకానికి ఎంపికైన గ్రామంలో ప్రధానమంత్రి యోజన ద్వారా 20 లక్షల రూపాయలు గ్రామపంచాయతీ మౌలిక సదుపాయాలకు అదనంగా నిధులు మంజూరైనట్లు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శి మరియు సచివాలయం సిబ్బంది గ్రామంలో సర్వే నిర్వహిస్తున్నారని అవసరమైన చోట్ల రోడ్లు మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## 20వ తేదీన దీపావళి పండుగ జరుపుకోవాలి

▶ జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఈనెల 20వ తేదీన దీపావళి పండుగను ఘనంగా జరుపు కోవాలని జ్యోతిష శిరోమణి డాక్టర్ జివిబి మురళీకృష్ణ అన్నారు. శనివారం ఆయన మేజర్‌న్యూస్‌తో దీపావళి పండుగపై మాట్లా డారు. ఈనెల 20వ తేదీన మధ్యాహ్నం 3.45 నిమిషాలకు అమావాస్య ఘడియలు ప్రారంభమై 21వతేదీ మంగళవారం సాయం త్రం 5.54 నిమిషాల వరకే అమావాస్య ఉంటుందన్నారు. అమావాస్య ఘడియలు సూర్యాస్తమయం తర్వాత కనీసం రెండు గంటలపాటు ఏ రోజున అయితే ఉంటాయో ఆరోజు దీపావళి జరుపుకోవడం సాంప్రదా యమన్నారు. 20వ తేదీసోమవారం దీపావళి జరుపుకోవాలని జ్యోతిష శిరోమణి పేర్కొన్నారు. రాత్రి 6.30 నిమిషాల నుండి 8.30 నిమిషాల వరకు లక్ష్మి పూజ నిర్వహించుటకు విశేషం అన్నారు. శ్రీ సూక్తం, శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రం పాటించడం వలన మంచి ఫలితాలు కలుగు తాయని జ్యోతిష శిరోమణి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల 44 నిమిషాల వరకు చతుర్దశి ఘడియలు ఉన్నందున ఆరోజునే నరక చతుర్దశి కూడా ఆ రోజున జరుపుకోవచ్చన్నారు. 21వ తేదీ మంగళ వారం మధ్యాహ్న సమయంలో అమావాస్య ఘడియలు ఉన్నందున కేదారేశ్వర వ్రతం చేసుకోవచ్చు అన్నారు.

## పర్యావరణం పై అవగాహన ర్యాలీ




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్ర మంలో భాగంగా శనివారం ఉదయగిరి పట్టణంలో ఉన్నత పాఠశాల నుంచి మెయిన్‌బజార్ మీదుగా పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు అధికారులు, విద్యార్థులు నినాదాలతో కూడిన అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం పంచాయతీ బస్టాండ్ సెంటర్లో మానవహారం ఏర్పాటు డు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. విరివిగా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు లన్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాల వాడకాన్ని తగ్గించి బ్యాటరీ వాహనాలు, సైకిళ్లు వాడాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ ట్యాక్స్ ఉప య కమిషనర్ ఎన్వి సుబ్బారావు, ఎంపీఓ, అసిస్టెంట్ ఎంపీఓ గోపినాయక్, కరుణాకర్, ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి సమీక్ష



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఆత్మకూరు డివిజన్ పరిధిలోని వెల్ఫేర్ అసి స్టెంట్లు, అన్నీ కాలేజీల ప్రిన్సిపాల్స్‌కి, వసతిగృహ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం. నిర్వహించ బడింది. ఈ సమావేశం నందు పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్‌లకు సంబందించి న విద్యార్థుల సిక్స్ స్టెప్ వెరిఫికేషన్, జాయింట్ అకౌంట్ల వెరిఫికేషన్ గురించిన సమావేశానికి జిల్లా నోడల్ అధికారిణి, జిల్లా సంక్షేమ, సాధికా రతా అధికారిణి అయిన కె.శోభారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆత్మకూరు ఏఎస్‌డబ్ల్యూఓ డివిజన్ పరిధిలో 130 సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ పెండింగ్ ఉన్నాయని వాటిని త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత సిబ్బంది సమన్వయంతో పెండింగ్‌లో ఉన్న జాయింట్ అకౌంట్‌లను కూడా త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు లబ్ధి చేకూర్చాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి అన్నీ కాలేజీల ప్రిన్సిపాల్స్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు హాజరయ్యారు.

## పల్లంరెడ్డి మృతదేహానికి మాజీ మంత్రి కాకాణి నివాళి

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పొట్టెంపాడు మాజీ సర్పంచ్ పల్లం రెడ్డి జనార్దన్ రెడ్డి సతీమణి పల్లంరెడ్డి విజిత రెడ్డి(58) అనారోగ్యంతో మృతి చెందగా శనివారం రాష్ట్ర మాజీ మంత్రి కాకాణిగోవర్ధన్ రెడ్డి ఆమె మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పల్లం రెడ్డిని ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పల్లంరెడ్డి మృతి చాలా బాధాకరమని మాజీమంత్రి విచారం వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. మాజీ మంత్రితోపాటు మండల పార్టీ అధ్యక్షులు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ సుగుణ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# స్వచ్ఛ ఆంధ్రా అందరి లక్ష్యం కావాలి : మంత్రి ఆనం

● సైకిల్ ర్యాలీ ప్రారంభించిన మంత్రి ఆనం ● డంపింగ్ యార్డ్ పరిశీలన ● చీపురు పట్టిన మంత్రి






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛంధ్ర, స్వచ్ఛ ఆత్మకూరు అందరి లక్ష్యం కావాలని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మూడవ శనివారం ఆత్మకూరులో స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో మంత్రి రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. తొలుత మంత్రి డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి స్వచ్ఛంధ్ర సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మంత్రి ఆనం స్వయంగా చీపురు పట్టి రోడ్డును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అన్ని ప్రజా సంఘాల వారంతా స్వచ్ ఆంధ్ర, స్వచ్ఛ ఆత్మకూరు లక్ష్యంగా భావించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతా పాటించాలన్నారు. విరివిగా మొక్కలు నాటి పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో భూమిరెడ్డి పావని, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయ రెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, వేలూరు కేశవ చౌదరి, ఏఎంసి చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు, వైస్ చైర్మన్ గొట్టిగుండాల బుజ్జి రెడ్డి, తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాలరెడ్డి, కౌన్సిలర్‌లు సూరా భాస్కర్‌రెడ్డి, పెంచలయ్య యాదవ్, మహబూబ్బాషా, గోస్ బాషా, శివకోటారెడ్డి, రమాదేవి, తెలుగుదేశం నాయకులు పులిమి శైలజా రెడ్డి, దావా పెంచల రావు, సుంకర పెంచల చౌదరి, కేతా విజయ భాస్కర్ రెడ్డి,మున్సిపల్ కమీషనర్ సి.గంగా ప్రసాద్, తహసీల్దార్ పి.పద్మజా కుమారి, ఎంవిఐ రాములు, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక జీఎస్టీ రోడ్డులో శనివారం పర్యటించారు. నగర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని ప్రధాన డ్రైను కాలువలలో వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. డ్రైన్ కాలువలలో ప్రవాహానికి అడ్డంకిగా వీఆర్‌సీ కూడలి ప్రాంతం, బ్లూ మూన్ హొటల్, అభిరామ్ హొటల్, సత్య ఫోటో ఎక్స్ప్రెస్, చందన బ్రదర్స్, గాంధీ బొమ్మ లస్సీ సెంటర్ కూడలి, కొత్త హాల్ ప్రాంతం, లక్కీ షాపింగ్ మాల్, కనకమహాల్ కూడలిలోని జాకీ షోరూం ప్రాంతాలలో డ్రైను కాలువల అడ్డంకులను కమిషనర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించి సిబ్బందితో తొలగించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా డ్రైన్ కాలువలను ఆక్రమించి ఉన్న నిర్మాణాలను, పూడికతీత పనులకు అడ్డంకిగా నిర్మించిన మెట్లు, ర్యాంపులు తదితర నిర్మాణాలను తప్పనిసరిగా కూల్చివేస్తామని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఠాగూర్ పాఠశాలలో ముందస్తు దీపావళి

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి డైరెక్టర్ కె.దొరస్వామి రెడ్డిల ఆధ్వర్యంలో దీపావళి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యతను తెలియజేసి అనంతరం విద్యార్థులు వివిధ రకాల వేషధారణతో స్కిట్ను ప్రదర్శించి దీపావళి ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది. అలాగే నరకాసురుడి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులు టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# వీఎస్‌యూలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం సందడి

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో శనివారం ఉదయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం ఘనంగా జరిగింది. విశ్వవిద్యాలయాన్ని హరితవనంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మొక్కలు నాటుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతలో మొక్కల పాత్ర అత్యంత కీలకం. మొక్కలు నాటడమే కాక వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత. స్వచ్ఛమైన వాతావరణం విద్యార్థుల అభ్యసనానికి ఎంతో ఉపయోగకరం, అని తెలిపారు. అలాగే దేశాన్ని కలుష్యరహితంగా నిలుపడంలో ప్రజలు చైతన్యంతో ముందుకు రావాలని, పర్యావరణ పరిరక్షణను సామూహిక బాధ్యతగా భావించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్నవారు పర్యావరణ సంరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించేందుకు ప్రతిజ్ఞ చేశారు. 2047 నాటికి




'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' లక్ష్య సాధనలో అందరూ తమ వంతు పాత్ర పోషించాలని వీసీ సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. కె.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయశంకర్ అల్లం, ఆచార్య టి.వీరారెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన గాలి మానవ జీవనానికి పునాది : అడిషనల్ ఎస్పీ

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి నెల మూడో శనివారం 'స్వర్ణా ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం 'శుభ్రమైన గాలి'అనే అంశంపై జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయం నందు ర్యాలీ నిర్వహించి మానవహారం వేసి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అంతేకాకుండా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు మరియు సిబ్బందితో కలిసి ఆయా పోలీస్ స్టేషన్స్, పోలీస్ కార్యాలయం నందు స్వచ్ఛత శుభ్రత కార్యక్రమాలు చేపట్టి స్వర్ణా ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞలు చేయించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. స్వచ్ఛమైన గాలి మానవ జీవనానికి పునాదని, గాలి అనేది మన ఆరోగ్యం, శ్రేయస్సు, భవిష్యత్తు తరాల స్థిరత్వానికి కీలకమైనదని ఆమె వివరించారు. గాలి నాణ్యతలో మెరుగుదల, గాలి కాలుష్యం మరియు దానికి సంబంధించిన ఆరోగ్య సమస్యలను తగ్గించడమే లక్ష్యమని, రూఫ్ టాప్ సోలార్ వంటి పునరుత్పాదక శక్తి వనరులను ఉపయోగించాలని, పొలాలలో అవశేషాలను దహనం చేయకుండా నిరోధించాలని తెలియజేశారు. మన ఊపిరితిత్తులకు స్వచ్ఛమైన గాలి అవసరం మన భవిష్యత్తుకు స్థిరమైన పర్యావరణం అవసరం.. ఈరోజు మనం తీసుకునే చిన్న చిన్న చర్యలు రేపటి తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందిస్తాయని, శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలు గాలి కాలుష్యం వల్ల మరింత తీవ్రమవుతున్నాయని, నీటి మాదిరిగానే స్వచ్ఛమైన గాలి ఒక ప్రాథమిక హక్కు కానీ పెరుగుతున్న కాలుష్యం పారిశ్రామిక విస్తరణ వాహన ఉద్గారాలు, అటవీ నిర్మూలన వంటి కారణాల వల్ల గాలి రోజురోజుకు క్షీణిస్తుందని ఆమె వివరించారు. చెట్లు గాలిని శుద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రతి పౌరుడు చెట్టు నాటడం, దానిని సంరక్షించడానికి తోడ్పడాలని సూచించారు. స్వచ్ఛమైన గాలి




కోసం కలిసి పని చేద్దాం ఈ భూమిని జీవించడానికి మరింత అనుకూలమైన ప్రదేశంగా మార్చుదామని, స్వచ్ఛమైన గాలిని కాపాడేందుకు మనందరం కలిసి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్డిఎస్పి చంద్రమోహన్, ఎస్బి–2 సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, హెచ్‌జిఆర్ఐ పాల్ రాజ్, దర్గామిట్ట సీఐ రోశయ్య, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.